# సాక్షి
## వైఎస్‌ఆర్ జిల్లా

శనివారం । 18 । మార్చి । 2023




### కొనుగోళ్ల వెంటే చెల్లింపులు

రాష్ట్ర ప్రభుత్వం శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లాలో నెల రోజుల ముందు నుంచే కొనుగోలు ప్రారంభించింది. -IIలో..



### హత్య కేసులో నిందితుడి అరెస్ట్

బద్వేలులోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో ఈ నెల 15న ఓ వివాహితను లారీ కింద తోసి హత్య చేసిన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. -IIలో..



గరిష్టం/కనిష్టం
**35.8/22.0**

### వాతావరణం

జిల్లాలో శుక్రవారం 22.0 - 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### నేడు ప్రత్యేక లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 18న(శనివారం) ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రత్యేకలోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.ఎస్. మూర్తి, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి జి. గీత, డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ ఇన్‌చార్జి జడ్జి ఎస్. హేమలత ఒక ప్రకటనలో తెలియజేశారు. మరింత సమాచారం కోసం 08562 -258622, 244622 నంబర్లలో సంప్రదించాలని, districts.ecourts.gov.in/kadapa. dlsakadapa@gmail.com ను ఉపయోగించాలన్నారు.

### రేపు ప్రభుత్వ ఉద్యోగుల గృహనిర్మాణ సంఘం మహాసభ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఏపీ ఎన్జీఓ హోంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం మహాజన సభ జరుగనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు యస్ ఈశ్వరరెడ్డి, వై సాల్‌మోన్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 2021-22 సంవత్సరానికి సంబంధించిన అంతిమ ఆడిట్ రిపోర్టు, సంఘం అర్ధ సంవత్సరపు జమా ఖర్చులు ఆమోదించు విషయమై చర్చించనున్నట్లు చెప్పారు సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

### 19న రాష్ట్రస్థాయి కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: గుంటూరు పట్టణంలోని బీఆర్ స్టేడియంలో ఈనెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు రాష్ట్రస్థాయి కబడ్డీ మహిళల విభాగం క్రీడాఎంపికలు నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్‌వీపీ అమృత్ రాజ్ తెలిపారు. ఏపీ జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో నిర్వహించనున్న 69వ జాతీయస్థాయి మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

### 31లోగా ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను, ఖాళీజాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు బకాయిలను ఒకేసారి మార్చి 31లోగా చెల్లిస్తే దానిపై ఉన్న వడ్డీ మినహాయించనున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.ఎస్ ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్-19 కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, పన్ను సంస్కరణల వల్ల కొంత మంది పన్నులు చెల్లించలేకపోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఈ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

### క్రీడాకారులకు ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్‌లు

కడప స్పోర్ట్స్: ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వారు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృతరాజ్ తెలిపారు. ఉన్నతశ్రేణి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు.. ఆర్థిక సహకారం అందించేందుకు స్కాలరషిప్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ఆసక్తి గల వారు స్పోర్ట్స్‌స్కాలర్‌షిప్. ఓఎన్‌జీసీ.సీఓ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### వైవీయూ, జేఎన్‌టీయూ మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న వైవీయూ, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్లు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం, అనంతపురం జేఎన్‌టీయూ మధ్య అవగాహన ఒప్పంద కుదిరింది. వైవీయూ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన్ సమక్షంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వైవీయూ బొటానికల్ గార్డెన్, అనంతపురం జేఎన్‌టీయూ విద్యార్థులు, అధ్యాపకుల పరిశోధన కార్యకలాపాలు..అలాగే రెండు సంస్థల మధ్య సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైవీయూ బొటానికల్ గార్డెన్ బాధ్యులు డా. ఎ. మధుసూధన్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు, వైవీయూ వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, జేఎన్‌టీయూ ఇంజినీర్ అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. రైతుకు నష్టం

- జిల్లాలో దెబ్బతిన్న అరటి, నిమ్మతోటలు
- రూ. 12.76 లక్షల మేర ఉద్యానపంటలకు నష్టం

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వ్యవసాయ, ఉద్యానపంటలకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం జిల్లాలో పసుపు ఉడికించి కల్లాల్లో అరబెట్టారు. పెసలు, మినుములు, శనగలు నూర్పిళ్లు జరుగుతున్నాయి. అకాల వర్షంతో అక్కడక్కడ పంట దిగుబడులు తడిసిపోయామని పలువురు రైతులు తెలిపారు.

- జిల్లాలో వర్షం, గాలులలతో పలు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు, కోడూరు గ్రామాల్లో 10 మంది రైతులకు సంబంధించిన 25 ఎకరాల్లో అరటిపంట నేలకొరిగింది. దీంతో వారికి రూ. 2.50 లక్షల మేర నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచానాలను ఉద్యానశాఖ అధికారులు సిద్ధం చేశారు. చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లె గ్రామంలో ముగ్గురు రైతులకు సంబంధించి 1.2 ఎకరాల్లో అరటపంట దెబ్బతినగా 30 వేల నష్టం, అప్పరాజుపల్లె గ్రామాలో ఇద్దరు రైతులకు సంబంధించి 80 సెంట్లలో అరటి, మరో ఇద్దరికి చెందిన 80 సెంట్లలో నిమ్మతోటలు వర్షానికి నేలకొరిగాయి. వీరికి రూ. 36 వేలు నష్టం వాటిల్లింది. చక్రాయపేట మండలం కె.రాజుపల్లె, కుప్పం, కుమ్మరకాల్వ, నర్సుపల్లె గ్రామా ల్లో 84 మంది రైతులకు సంబంధించి 119.5 ఎకరాల్లో నిమ్మపంట నేలకొరిగింది. రూ.9.6 లక్షల మేర నష్టం వాటిలినట్లు అధికారులు గుర్తించారు. రూ.12.76 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు



పెండ్లిమర్రి మండలం నాగాయపల్లె గ్రామంలో నేలకొరిగిన అరటిపంట

ఉద్యాన శాఖ అధికారులు అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదికలను సమర్పించారు.

- జిల్లాలోని పులివెందుల్లో అత్యధికంగా 40.2 మిల్లీ మీటర్లు, అట్లూరులో అత్యల్పంగా 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**వల్లూరు:** మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షాలు, పెను గాలులకు నల్లపురెడ్డిపల్లె, అంబవరం, దిగువపల్లె, పైడికాలువ,, సీతోరుపల్లె, లింగాయపల్లె తదితర గ్రామాలతో బాటు పైడికాలువ ఫీడర్ కింద ఉన్న పెండ్లిమర్రి మండలం కోనాయపల్లె, మాచనూరు, చొటపల్లె పరిధిలో 30 విద్యుత్ స్థంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ శాఖకు సుమారు 2 లక్షల రూపాయలు నష్టం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ డానియల్ జోసెఫ్ తెలిపారు.

**పెద్దముడియం:** మండలంలోని పలు గ్రామాల్లో గాలులకు విద్యుత్ స్థంభాలు,చెట్లు కూలిపోయాయి..భీమగుండంలో గేదెపై చెట్టు పడటంతో మృతి చెందింది.

**చాపాడు:** మండలంలో పసుపు పంట నూర్పిడి చేసి చేలో రాశులుగా పోశారు. వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.



వల్లూరు: మాచనూరులో కూలిన విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్



చక్రాయపేట మండలం కుప్పం గ్రామంలో వేర్లతో సహా నేలకొరిగిన నిమ్మచెట్లు



పెద్దముడియం: భీమగుండం గ్రామంలో చెట్టు విరిగి మీద పడంటతో మృతి చెందిన గేదె

**మండలం కురిసిన వర్షం(మి.మీ )**

| | | | |
|---|---|---|---|
| పులివెందుల | :40.2 | పెండ్లిమర్రి | :15.6 |
| బికోడూరు | :37.0 | బిమతం | :15.2 |
| చక్రాయపేట | :35.2 | లింగాల | :15.0 |
| వేముల | :34.8 | కొండాపురం | :14.6 |
| సికెదిన్నె | :33.6 | రాజుపాలెం | :13.2 |
| వల్లూరు | :33.2 | పోరుమామిళ్ల | :13.2 |
| వెంపల్లి | :31.6 | దువ్వూరు | :12.4 |
| వీఎన్‌పల్లె | :30.4 | ఎర్రగుంట్ల | :12.0 |
| మైలవరం | :29.4 | చాపాడు | :10.6 |
| కడప | :23.4 | ఖాజీపేట | :10.2 |
| ముద్దనూరు | :22.4 | సింహాద్రిపురం | :8.2 |
| చెన్నూరు | :21.3 | ప్రొద్దుటూరు | :7.8 |
| కమలాపురం | :18.6 | కాశినాయన | :5.6 |
| జమ్మలమడుగు | :17.2 | సిద్దవటం | :4.2 |
| మైదుకూరు | :17.0 | గోపవరం | :3.2 |
| తొండూరు | :16.8 | ఒంటిమిట్ట | :2.0 |
| పెద్దముడియం | :16.2 | అట్లూరు | :1.2 |

### డీఈఓ రాఘవరెడ్డి బాధ్యతల స్వీకరణ



డీఈఓగా బాధ్యతలు చేపడుతున్న రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా(డీఈఓ) రాఘవరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనది ప్రకాశం జిల్లా కొమ్మరోలు మండలం నారాయణపల్లె గ్రామం. 1998 జూన్‌లో కర్నూల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1999 అక్టోబర్‌లో ఎస్‌సీఈఆర్టీలో అదే హోదాలో వెళ్లి విద్య, మూల్యాంకన విభాగాల్లో పనిచేశారు. ఇదే సమయంలో కంప్యూటర్ ఎడ్యుకేషన్‌పై దృష్టి సారించి అంచెల పద్ధతిలో 20 వేల మంది ఉపాధ్యాయులకు మైక్రోసాఫ్ట్ సహకారంతో కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చారు. మార్చి 17న జిల్లా రెగ్యులర్ డీఈఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.బాధ్యతలు చేపట్టిన వెంటనే కడప లోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్, గాంధీనగర్ నగరపాలక, జయనగర్ కాలనీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను డీఈఓ తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతోపాటు కూర్చుని పాఠాలు విన్నారు. పదోతరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

### ఇంటర్ పరీక్షల్లో 1054 మంది గైర్హాజర్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో ఇంగ్లీషు పరీక్షకు 23,856 మంది విద్యార్థులకుగాను 22802 మంది హాజరయ్యారు. 1054 మంది గైర్హాజరయ్యారు. 95.58 శాతం నమోదైంది. రాయచోటి పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థిని డీబార్ చేశారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్‌బోర్డు పరిశీలకుడు రవిశంకర్‌నాయక్, ఆర్ఐవో రమణరాజు, నలుగురు జిల్లా కమిటీ , ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీ చేశారు.

### పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి

జమ్మలమడుగురూరల్: కొండాపురం మండంలోని పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులకు సూచించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌తో కలిసి జమ్మలమడుగు ఆర్డీఓ ఛాంబర్‌లో జలవనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్‌ల ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వి. విజయరామరాజు మాట్లాడుతూ ఈ నెల చివరి నాటికి పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాల కొరకు నిధులు వస్తాయని తెలిపారు. కావున రోడ్లు, కల్వర్టులు, కాలువలు, విద్యుత్ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట మేరకు గండికోట బాధితులకు రూ. 3.25 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉందన్నారు. అందుకు సుమారు



సమావేశం అనంతరం బయటకు వస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

రూ. 450 కోట్ల రుపాయలు చెల్లించాల్సి ఉందని, బాధితుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులతో కలసి పెద్దముడియం మండలం జె. కొత్తపల్లెకు బయలుదేరారు.

### ముగిసిన టెక్‌ఫెస్ట్ 2కె23

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం టెక్ ఫెస్ట్ 2కె-23 కార్యక్రమాలు ముగిశాయి. చివరిరోజు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఫాసర్ 2కె23 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో డిజైన్ ఆఫ్ ఎలక్ట్రికల్ వెహికల్ యూజింగ్ మ్యాట్ లాంబ్ అనే అంశంపై ఐఈఐ కడప లోకల్ సెంటర్ సహకారంతో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిక్షణకు ప్రిన్సిపాల్ వసుంధర, అధ్యాపకులు వైశాలి, శ్రీనివాసంలు హాజరయ్యారు. అనంతరం కడప లోకల్ సెంటర్ గౌరవ కార్యదర్శి నరేంద్రరావు ఐఈఐ ఐఈఐ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రాముఖ్యతను వివరించారు.



బ్రోచర్లను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ వసుంధర, తదితరులు

### రిమ్స్‌కు 71 పీజీ సీట్లు రావచ్చు

- ప్రిన్సిపాల్ సురేఖ



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్ఎంసీ అధికారులు

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల రిమ్స్‌లో రానున్న రోజుల్లో దాదాపు ఒకేసారి 11 విభాగాల్లో 71 పీజీ వైద్య విభాగాల సీట్లు రానున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) నుంచి నాలుగు విభాగాల్లో పీజీ వైద్య విభాగం సీట్లు అనుమతులను ఇచ్చేందుకు తనిఖీలను నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్‌లో 9, రేడియో డయాగ్నోసిస్‌లో 7, రేడియేషన్ అంకాలజీలో 5, ఎమర్జెన్సీ వైద్య విభాగంలో 5 సీట్ల అనుమతుల కోసం పరిశీలన జరిగింది. ఈనెల 15న ఎన్ఎంసీ విభాగం అధికారులు 7 విభాగాల్లో పీజీ వైద్య విభాగం సీట్లకు అనుమతులు ఇచ్చేందుకు పరిశీలన చేశా రు. బయోకెమిస్ట్రీలో 5, మైక్రోబయాలజీలో 9, ఫార్మకాలజీలో 7, ఫోరెన్సిక్ మెడిసిన్‌లో 5, ఫెథాలజీలో 9, రెస్పిరేటరీ మెడిసిన్‌లో 5, సైక్రియాట్రీలో 5 చొప్పున పీజీ వైద్య విభాగం సీట్ల కోసం అధికారులు పరిశీలించారని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

### వసతిగృహం, విద్యాలయం తనిఖీ

వల్లూరు: వల్లూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని , కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాన్ని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట వల్లూరు సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడ చదవుతున్న ఆరోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంగ్లీషు సబ్జెక్టులో అంబేడ్కర్ పాఠ్యంశాన్ని గురించి ప్రశ్నించారు. దీనికి సంబంధించి నోట్‌బుక్‌లను ఉపాధ్యాయులు కరెక్షన్ చేయక పోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. హైస్కూల్‌ను విజిట్ చేసి నోట్‌బుక్‌లను కరెక్షన్ చేయని ఉపాధ్యాయులపై డీఈవోకు ఫిర్యాదు చేయనందుకు ఎంఈవోకు, సంబంధిత ఉపాధ్యాయునికి మెమో ఇవ్వాలని డీఈవోను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. బైజ్యూస్ కంటెంట్ గురించి ఆరా తీశారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో రాఘవరెడ్డి, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో లిల్లెమ్మ, కేజీబీవీ ప్రిన్సిపల్ నజీమున్నీసా పాల్గొన్నారు.

**విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు**

కడప ఎడ్యుకేషన్: విధుల పట్ల ఎవరైనా ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి కడప నరగంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలతోపాటు ఉర్దూ రెసిడెన్సియల్ స్కూల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అక్కడ విద్యార్థులకు సరైన వసతులు లేవని గుర్తించారు. అక్కడ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ ఆర్‌జేడీ రవిని ఆదేశించారు. ఈయన వెంట ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ రవి, ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల డీఈఓలు ఎద్దుల రాఘవరెడ్డి, పురుషోత్తం, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓ పాలెం నారాయణ ఉన్నారు.



వల్లూరులోని బాలుర హాస్టల్‌లో విద్యార్థుల నోట్‌బుక్‌లను పరిశీలిస్తున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

### జిల్లా ఆసుపత్రి పరిశీలన

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలోని శానిటేషన్‌ను శుక్రవారం కాయకల్ప రాష్ట్ర అధికారులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ వినోద్‌లు పరిశీలించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులు, ఆపరేషన్ థియేటర్‌తో పాటు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ తీరుపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, ఆర్ఎంఓ రూపానంద్‌లు రోజు వారి పారిశుధ్య నిర్వహణ గురించి అధికారులకు వివరించారు. ఆస్పత్రిలోని పలు రికార్డులను అధికారులు తనిఖీ చేశారు.

# టీచర్స్ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీదే

- ఎమ్మెల్సీగా ఎంవీ రామచంద్రారెడ్డి ఎన్నిక
- రెండో స్థానంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎంవీ రామచంద్రారెడ్డి విజయం సాధించారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మధ్య నడిచింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలలేదు. దీంతో రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. 169 ఓట్లతో రామచంద్రారెడ్డి గెలుపొందినట్టు ఎన్నికల అధికారులు శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రకటించారు.

**రౌండు రౌండులో ఉత్కంఠ**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతి రౌండులోనూ ఉత్కంఠ కొనసాగింది. 25 వేల పైచిలుకు ఓట్లు పోలవగా.. ఇద్దరు అభ్యర్థులకు మాత్రమే 10 వేల మార్కు దాటింది. మొత్తం 12 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో పది మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. చివరకు ఎంవీ రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మిగిలారు.



కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా డిక్లరేషన్ అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

వాస్తవానికి పోలైన ఓట్లలో 50 శాతం సాధించిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. కానీ రెండో ప్రాధాన్యతలో కూడా ఎవరూ 50 శాతం ఓట్లు సాధించలేదు. ఈ దశలో నిబంధనల ప్రకారం విజేతను ప్రకటించవచ్చు. ఇందులో భాగంగానే 169 ఓట్ల ఆధిక్యత ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిని విజేతగా నిర్ణయించారు.

**ఆసక్తిరేపిన ఎలిమినేషన్**

రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ అందరిలోనూ ఆసక్తి రేపింది. రామచంద్రారెడ్డి, ఒంటేరు మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ నెలకొనడంతో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వస్తాయో, ఎవరిని విజయం వరిస్తుందోనని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూశారు. ముఖ్యంగా మూడోస్థానంలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని ఎలిమినేట్ చేసే క్రమంలో ఆయన బ్యాలెట్లలోని రెండో ప్రాధాన్యత ఓట్లను మిగతా ఇద్దరు అభ్యర్థులకు కేటాయించే సమయంలో విజయం దోబూచులాడింది. ఈ ఓట్లలో ఎక్కువ శాతం ఒంటేరు శ్రీనివాసులరెడ్డికి వెళ్లడంతో ఆయన విజయం ఖాయమనుకున్నారు. కానీ చివరకు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యాక చూస్తే రామచంద్రారెడ్డికే ఆధిక్యత లభించింది.

**సీఎం ఆశీస్సులతోనే విజయం**

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని ఎం.వి.రామచంద్రారెడ్డి తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందినట్లు శుక్రవారం జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రం వద్ద కలెక్టర్ చేతుల మీదుగా ఆయన డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

**విజేత రామచంద్రారెడ్డి**

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది పోటీ చేశారని ఆర్‌ఓ, కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ప్రాథమిక ఓట్లను బదిలీ చేస్తూ పోగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి పోటీలో నిలిచారన్నారు. ప్రాధాన్యత ఓట్ల బదిలీ తర్వాత ఎవరికీ 50 శాతంపైగా ఓట్లు దక్కలేదన్నారు. దీంతో అత్యధిక ఓట్లు సాధించిన రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించామని రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు.

**'తొలి ప్రాధాన్యత'లో అభ్యర్థుల వారీ ఓట్లు**

| అభ్యర్థి | వచ్చిన ఓట్లు |
|---|---|
| ఒంటేరు శ్రీనివాసులరెడ్డి | 6,853 |
| కత్తి నరసింహారెడ్డి | 4,162 |
| అనిల్ ప్రసాద్‌రెడ్డి | 3,212 |
| జీవీ నారాయణరెడ్డి | 1,345 |
| ఎంవీ రామచంద్రారెడ్డి | 8,846 |
| అనిల్‌కుమార్‌రెడ్డి | 186 |
| ఎస్.మాధవరావు | 354 |
| రామశేషయ్య | 187 |

**రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితమిలా..**

| | |
|---|---|
| మొత్తం పోలైనవి | 25,272 |
| చెల్లని ఓట్లు | 3,867 |
| ఎంవీ రామచంద్రారెడ్డి | 10,787 |
| ఒంటేరు శ్రీనివాసులరెడ్డి | 10,618 |
| మెజారిటీ | 169 |

### సమస్యల పరిష్కారానికి కృషి



పూలమాలలో అభినందిస్తున్న అభిమానులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అనంతపురంలో గురువారం నిర్వహించిన ఎన్నికల కౌటింగ్‌లో విజయం సాధించి శుక్రవారం కడపకు చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. అనంతరం సాయిబాబా విద్యాసంస్థల డైరెక్టర్, స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి, అభిమానుల మధ్య కట్‌చేశారు. రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్, పీఎస్‌టీయూ, పీఆర్‌టీయూ, ఎస్టీఎఫ్, పీడీ అసోసియేషన్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పొచంరెడ్డి సుబ్బారెడ్డి తదితరు శుభాకాంక్షాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు

# కొనుగోళ్ల వెంటే చెల్లింపులు

- కేంద్రాల ద్వారా వేగంగా శనగల సేకరణ
- వారం, పది రోజులకే డబ్బులు ఇస్తున్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


శనగలు విక్రయిస్తున్న రైతులు

**కడప అగ్రికల్చర్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతులను అడుగడుగునా ఆదుకుంటోంది. పంటల సాగుకు పెట్టుబడి సాయం నుంచి.. దిగుబడులు వచ్చిన తరువాత గిట్టుబాటు ధర కల్పిస్తూ అండగా నిలుస్తోంది. ఇందు కోసం శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో నెల రోజుల ముందు నుంచే శనగల కొనుగోలు ప్రారంభించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**క్వింటాల్‌కు రూ.735 అదనంగా ధర**

జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 29 మండలాల పరిధిలో 63,122 హెక్టార్లలో శనగ పంట సాగు చేశారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ రూ.4,600 ఉండగా.. ప్రభుత్వం 5,335 చెల్లిస్తోంది. అంటే క్వింటాల్‌పైన రూ.735 అదనపు ధర కల్పిస్తోంది. ఎకరాకు సాధారణ దిగుబడి 5 క్వింటాళ్ల చొప్పున లెక్కకట్టి కొనుగోలు ప్రారంభించింది. ఈ లెక్కన 5 క్వింటాళ్ల నుంచి ఆపైన ఎంత ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. రాజుపాళెం మండలంలో ఒకే రైతుకు సంబంధించి 235 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు.

**11,118 మెట్రిక్ టన్నుల కొనుగోలు**

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 29 మండలాల పరిధిలో 63,122 హెక్టార్లలో శనగ పంట సాగు చేశారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 20,850 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతులు ఇచ్చింది. గత నెల 13 నుంచి 22 కొనుగోలు కేంద్రాల పరిధిలో ఈ నెల 16వ తేదీ నాటికి 11,118.5 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

**రూ.18.86 కోట్ల చెల్లింపు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏదైనా ధాన్యం కొనుగోలు చేసి గోడౌన్‌కు చేరిన 21 రోజుల తరువాత చెల్లింపులు ఉంటాయి. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి శనగలు కొనుగోలు చేసి గోడౌన్‌కు తరలించిన వారం, పది రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 5,528 రైతుల నుంచి రూ.59.31 కోట్ల విలువ చేసే 11,118.5 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసింది. 2078 మంది రైతులకు రూ.18.86 కోట్లను చెల్లించినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఇంకా 3450 మంది రైతులకు 40.45 కోట్ల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

**గడువులోపు లక్ష్యం సాధిస్తాం**



జిల్లాలో ప్రస్తుతం శనగల కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. 20832 మెట్రిక్ టన్నులకు గాను ఇప్పటి వరకు 5528 మంది రైతుల నుంచి 11 వేల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేశాము. ఇప్పటి వరకు 2078 మంది రైతులకు నగదు చెల్లించాము. మిగతా 3450 మంది రైతులకు త్వరలో చెల్లిస్తాము. లక్ష్యాన్ని గడువులోపు సాధిస్తాం.

– తాటిగొట్ల నరసింహారెడ్డి, డీఎం, జిల్లా మార్క్‌ఫెడ్

## క్లుప్తంగా

### పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫుడ్‌కోర్టుకు టెండర్లు


ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

**కడప అర్బన్ :** జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో 2018 నుంచి నిర్వహిస్తున్న అమృత్ ఫుడ్‌కోర్టును పోలీస్ లైన్‌లోని పెట్రోల్ బంక్ కుడి పక్కన వున్న జిల్లా పోలీసుశాఖకు చెందిన ఖాళీ స్థలంలోకి మార్చనున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు ఖాళీ స్థలంలో వారే అభివృద్ధి చేసుకుని, స్థలానికి నెలవారీ అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఆసక్తి గల వారి నుంచి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈఏడాది ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు) కుదుర్చుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన టెండరు బాక్స్‌లో దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు.

### వడగండ్ల వర్షానికి 130 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

**పెద్దముడియం :** మండలంలోని పాలూరు గ్రామ పొలాల్లో వడగండ్ల వర్షానికి 130 గొర్రెలు మృతి చెందాయి. ముద్దనూరు మండలంలోని యామవరం, దుద్దేల గ్రామాలకు చెందిన కాపరులు తమ గొర్రెలను మండంలోని పాలూరు గ్రామ పొలాల్లో పది రోజుల నుంచి మేపుతున్నారు. గురువారం రాత్రి తుపాను ప్రభావంతో వడగండ్ల వర్షం కురిసింది. వడగండ్ల ధాటికి తట్టుకోలేక 47 గొర్రెలు, 83 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెల యజమానులు వాపోయారు. సంఘటన స్థలానికి తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఇతర అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా క్రిష్టారెడ్డి, ప్రసాద్ రెడ్డి వచ్చి చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. ప్రభుత్వం తరపున సాయం వచ్చే విధంగా కృషి చేస్తామని వారు తెలిపారు.

## టైల్స్ మీద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


మృతి చెందిన విశ్వనాథ్‌రెడ్డి

**పెండ్లిమర్రి :** మండల పరిధి మాచునూరు గ్రామ పంచాయతీలోని అరవేటిపల్లెలో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు టైల్స్ మీద పడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సి.విశ్వనాథ్‌రెడ్డి(28) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేస్తూ.. ఇంటి వద్ద నుంచే పని (వర్క్ ఫ్రం హోమ్) చేస్తున్నాడు. తన ఇంటిపై నిర్మిస్తున్న మొదటి అంతస్తులో గురువారం రాత్రి ఉండగా.. బలమైన ఈదురుగాలులు వీచాయి. ఇంటికి వాడే టైల్స్ పక్కన గోడకు ఆనించి ఉండగా.. అవి కాలు మీద పడ్డాయి. మోకాలు వెనుక వైపు పాదం వరకు కోసుకొని పోయింది. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఆయనకు తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. ఉద్యోగం చేస్తున్న కన్న కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. బంధువులలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## కూతురిని విదేశాలకు సాగనంపి వస్తుండగా..


బోల్తా పడిన కారు


షఫీవుల్లా, షాహీనాబేగం (ఫైల్)

- కర్ణాటకలో మదనపల్లె దంపతుల దుర్మరణం
- కారు బోల్తాతో ఘటన

**మదనపల్లె :** కన్నకూతురిని ఉన్నత చదువుల కోసం విదేశాలకు సాగనంపి.. సంతోషంగా తిరిగి వస్తున్న దంపతులను విధి చిన్నచూపు చూసింది. కర్ణాటక రాష్ట్రం లక్ష్మీపురం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లెలోని కోటవీధికి చెందిన అమీన్ స్టోన్‌క్రషర్స్ యజమాని షఫీవుల్లా, ఆయన భార్య షాహీనబేగం దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కోటవీధికి చెందిన షఫీవుల్లా(55) సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తూ, పట్టణంలోని హజరత్ మస్తాన్‌వలీ కమిటీ దర్గా సభ్యులుగా కొనసాగుతున్నారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన షాహీనా బేగం(50)కు షఫీవుల్లాతో వివాహం జరిగింది. ఈమె విద్యావంతురాలు. వివాహానికి ముందు అధ్యాపకురాలుగా పని చేశారు. వీరికి షాదు, షైమా, షిఫా అనే ముగ్గురు కుమార్తెలు. షాదు, షైమాలకు వివాహమైంది. చిన్నకూతురు షిఫా విదేశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు దరఖాస్తు చేసుకోగా అనుమతి లభించడంతో.. గురువారం రాత్రి కారులో కుమార్తెతో కలిసి బెంగళూరు ఎయిర్ పోర్ట్‌కు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం వేకువజామున కుమార్తె షిఫాను విమానం ఎక్కించి మదనపల్లెకు తిరుగుప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో కర్నాటక రాష్ట్రం శ్రీనివాసపురం తాలూకా లక్ష్మీపురం క్రాస్ వద్ద రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండటం, విశ్రాంతి లేకుండా వాహనాన్ని నడుపుతుండటంతో నిద్రముంచుకురావడంతో అదుపు తప్పి సుమారు 10 అడుగుల లోతులోకి కారు బోల్తా పడింది. కారులోనే దంపతులిద్దరూ మృతి చెందారు. ఉదయం అటుగా వచ్చిన స్థానికులు సమాచారం అందించడంతో.. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతులను మదనపల్లెకు చెందిన వారుగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం శ్రీనివాసపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కర్ణాటకలోని రోడ్డుప్రమాదంలో పట్టణంలోని కోటవీధికి చెందిన దంపతులిద్దరూ మరణించిన వార్త తెలియడంతో.. స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

## హోరాహోరీగా పట్టభద్రుల పోరు

- ఆధిక్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి
- 9వ రౌండు ముగిసేసరికి 1,413 ఓట్ల మెజారిటీ
- మొదటి ప్రాధాన్యత ఓటులో ఫలితం తేలే అవకాశం లేదన్న అధికారులు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు ఉత్కంఠగా మారాయి. ఇప్పటివరకూ 9 రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అభ్యర్థి విజయం సాధించాలంటే మొత్తం పోలైన ఓట్లలో 50 శాతం సాధించాలి. కానీ తొలి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుంది. శుక్రవారం రాత్రి 11.15 గంటలకు 9వ రౌండు ఓట్లలెక్కింపు పూర్తయ్యింది. ఇప్పటిదాకా వెన్నపూస రవీంద్రారెడ్డికి 84,153 ఓట్లు, టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డికి 82,740 ఓట్లు వచ్చాయి. వెన్నపూస 1,413 ఓట్ల మెజారిటీలో ఉన్నారు. మరో రెండు రౌండ్ల ఓట్ల లెక్కింపు మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలే అవకాశం కన్పించలేదు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపునకు వెళితే ఫలితం శనివారం మధ్యాహ్నాం తేలే అవకాశం ఉంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,45,576 ఓట్లు పోలవగా.. ఇప్పటివరకూ 2,16,014 ఓట్లను లెక్కించారు. అందులో 16,976 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మిగతా 1,99,038 ఓట్లను పరిగణనలోకి తీసుకున్నారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు

**బద్వేలు అర్బన్ :** స్థానిక నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో ఈ నెల 15న ఓ వివాహితను లారీ కింద తోసి హత్య చేసిన నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ జి.వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఐలమ్మకాలనీకి చెందిన అమిలిపోగు లక్ష్మీదేవి బుధవారం రాత్రి ఇంటికి వెళుతున్న సమయంలో.. మున్సిపాలిటీ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన ఎల్లుర్తి చంద్రశేఖర్ అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిని ఆమె ప్రతిఘటించడంతోపాటు అతడిని దూషించింది. అయినప్పటికీ వెంటపడుతూ వేధిస్తుండటంతో ఫోన్‌లో తన భర్తకు, తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతోపాటు చంద్రశేఖర్‌ను తన ఫోన్‌లో ఫొటో తీసింది. దీంతో ఆవేశానికి లోనైన చంద్రశేఖర్ లక్ష్మీదేవిని బలంగా తోసేయడంతో లారీ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన జరిగిన సమయంలో చూసిన ప్రత్యక్ష సాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతను తన స్వగ్రామమైన వల్లెరవారిపల్లె పొలాల్లో ఉన్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐలు కత్తి వెంకటరమణ, శ్రీకాంత్, కానిస్టేబుళ్లు సుబ్బరాయుడు, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెనుశిల అభయారణ్యంలో అరుదైన జంతువులు



పెనుశిల లక్ష్మీనరసింహస్వామి అభయారణ్యంలో గుర్తించిన చిరుతపులి (ఇన్‌సెట్) మాట్లాడుతున్న రేంజర్ నారాయణ

**చిట్వేలి :** పెనుశీల శ్రీలక్ష్మీనరసింహస్వామి అభయారణ్యాన్ని టైగర్ కారిడార్‌గా చూడాలన్నదే అటవీ శాఖ అధికారుల లక్ష్యమని చిట్వేలి రేంజ్ ఆఫీసర్ ఆర్.నారాయణ పేర్కొన్నారు. చిట్వేలి ఫారెస్టు కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్నమయ్య జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ అనుమతి మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 1997 సెప్టెంబర్ 15 నుంచి జీఓ నంబరు 106 ప్రకారం వైఎస్ఆర్, నెల్లూరు జిల్లాల పరిధిలోని 1038.35 చదరపు కిలోమీటర్ల మేర విస్తీర్ణాన్ని లక్ష్మీనరసింహస్వామి అభయారణ్యంగా గుర్తించడం జరిగిందన్నారు. సోమశిల వెనుక జలాల ప్రాజెక్టు మూలంగా అన్ని రకాల జంతువులకు స్థావరంగా ఇక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా టైగర్ కారిడార్‌ను గుర్తించేందుకు శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు వారి సాయంతో రాజుకుంట, కొండూరు పరిధిలో ఫిబ్రవరి 22వ తేది నుంచి 20 రోజుల పాటు పది పాయింట్ల వద్ద రెండు కెమెరాలు చొప్పున 20 కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మూడు చిరుత పులులను గుర్తించామని, అంతేకాకుండా నెమలి, కొనతులు, ముళ్ళపందులు, కొండగొర్రె, ఎలుగుబంట్లు ఇలా పలు రకాల జంతువుల ఫొటోలను కెమెరాలు తీశాయన్నారు. ఈ ప్రాజెక్టు మరో 20 రోజులపాటు కొనసాగుతుందని అన్నారు. కాగా పులిని గుర్తించడం ప్రధాన మూలంగా ఈ ప్రాజెక్టు కొనసాగుతుందన్నారు. ఈ అభయారణ్యం ఎకోసైన్స్ జోన్‌గా పరిగణించారని, కావున అటవీ అధికారుల అనుమతి లేనిదే ప్రవేశం లేదని పేర్కొన్నారు. అడవి భూభాగంలోకి రెండు కిలోమీటర్ల పరిధికి దూరంగా ఉండాలని, అటవీ సమీపాన ప్రాజెక్టులు, ఎర్రచందనం తదితర పనులు నిషిద్ధమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఎఫ్ఎస్ఓ శ్రీనివాసులు, కొండూరు ఎఫ్ఎస్ఓ ఎస్ సావిత్రి, రాజుకుంట, కొండూరు బీట్ ఆఫీసర్లు వెంకట సుబ్బమ్మ, కరిముల్లా బాషా, కేవీ సుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో లైన్‌మ్యాన్‌కు గాయాలు


సురేష్‌ను కిందికి దించుతున్న సిబ్బంది

**కలసపాడు :** మండలంలోని రాజుపాలెం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై రాజుపాలెం సచివాలయ విద్యుత్ ఉద్యోగి సురేష్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం ఒక లైన్‌కు ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేస్తుండగా దానిపైన మరో లైన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సిబ్బంది, రైతులు గమనించి కరెంటు ఆఫ్ చేసి విద్యుత్ స్తంభం నుంచి కిందికి దించారు. కలసపాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సలహా మేరకు పోరుమామిళ్లకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. విద్యుత్ అధికారుల తప్పిదం వల్లే ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– మరొకరికి గాయాలు

**సంబేపల్లె :** కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై దేవపట్ల మిట్ట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలైన సంఘటన చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మాసాపేటకు చెందిన సోమల ఆదినారాయణ(46), జరుగు ఉమాశంకర్‌రెడ్డి సంబేపల్లె మండలం దేవపట్ల మిట్టవద్ద అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఒక వ్యక్తిని కలిసి తిరిగి రాయచోటి వెళ్లడానికి సిద్ధమయ్యారు. సమీపంలో బస్‌స్టేజి ఉండటంతో అక్కడికి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నారు. వారిని పీలేరు వైపు నుంచి రాయచోటికి వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందగా, ఉమాశంకర్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదినారాయణకు భార్య మాధవీలత, ముగ్గురు కుమారులు ఉన్నారు. వారు కన్నీరుమున్నీరుగా విలపించారు.

**అయ్యో పాపం**

సంఘటన చూసిన మృతుడి భార్య అదే రహదారిపై బస్సులో వెళ్తూ రోడ్డు ప్రమాదాలు మామూలే అని వెళ్లిపోయింది. అయితే ఆ ప్రమాదంలో మృతి చెందింది తన భర్త అని తెలుసుకోలేక పోయింది. మార్గంమధ్యలో తనకు ఫోన్ రావడంతో ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఈ విషయం తెలిసిన పలువురు 'అయ్యో పాపం' అంటూ విచారం వ్యక్తం చేశారు.


## బైక్ అదుపుతప్పి అన్నదమ్ములకు గాయాలు

**నిమ్మనపల్లె :** ద్విచక్రవాహన ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అగ్రహారం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన గుర్రప్ప కుమారులు గురునాథ్(29), జగదీష్(28), గణేష్(26) ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంలో వాల్మీకిపురం మండలం చింతపర్తికి వ్యక్తిగత పనులపై వెళ్లారు. తిరుగుప్రయాణంలో నిమ్మనపల్లె-చింతపర్తి మార్గంలోని ఆరిపిరెడ్డిగారిపల్లె వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, స్థానికులు గమనించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

**సిద్దవటం :** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పర్యావరణ పరిరక్షణే ధ్యేయమని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని భాకరాపేటలో శుక్రవారం సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన రైతులకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణపై అవగాహన సమావేశం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీఓ మాట్లాడుతూ కడప నుంచి చిన్న ఓరంపాడు వరకు ఎన్‌హెచ్ 716 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రైతులకు పర్యావరణంపై ఈ సమావేశంను నిర్వహించడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణలో కొంత మేరకు ఫారెస్టు, కొంత మేరకు పచ్చదనం దెబ్బతింటుందన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, కట్టడాలు కోల్పోయే రైతులకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు కొత్త ధరల ప్రకారం వీలైనంత ఎక్కువగా పరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హరిక్రిష్ణ మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో 29 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి 116 హెక్టార్ల భూమిని తీసుకోవడం జరిగిందన్నారు. 13 ప్రాంతాల్లో చిన్న చిన్న బ్రిడ్జిల నిర్మాణం, రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు 11 ప్రాంతాల్లో వెహికల్ అండర్ ప్రాసెస్, అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు, జంతువులకు మూడు చోట్ల అనిమల్ అండర్ ప్రాసెస్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ ఇంజనీర్ జావిద్ బాషా, సిద్దవటం, ఒంటిమిట్ట తహసీల్దారులు శంకర్‌రావు, శ్రీనివాసులరెడ్డి, ఎస్ఐలు తులసీ నాగప్రసాద్, మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు


అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ఉత్సవ ఏర్పాట్లు

**రాజంపేట :** పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 520 వర్ధంతి ఉత్సవాలు శనివారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లను పూర్తి చేసింది. అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తాళ్లపాకలో ధ్యానమందిర ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఉత్సవాలకు సిద్ధం చేశారు. కడప-రేణిగుంట హైవేలోని అన్నమయ్య థీంపార్కు, తాళ్లపాక ఆర్చి వద్ద స్వాగత తోరణాలను నెలకొల్పారు. విద్యుద్దీపాలంకరణ, లైటింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు.

**నేడు సంకీర్తన గోష్ఠిగానం**

తాళ్లపాక గ్రామంలో శనివారం ఉదయం 8 గంటలకు సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహించనున్నారు. నాదస్వర సమ్మేళనం కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ వెల్లడించింది. రోజూ సాయంత్రం వేళలో సంగీత సభలు, హరికథ కాలక్షేప కార్యక్రమాలు ఉంటాయి. ఈ ఉత్సవాలకు భక్తులు హాజరై జయప్రదం చేయాలని టీటీడీ పిలుపు నిచ్చింది.

## చావుబతుకుల్లో ఉన్న బిడ్డను బతికించండి

ప్రెస్‌క్లబ్‌లో తల్లిదండ్రుల వేడుకోలు


దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న కాంతమ్మ

**మదనపల్లె :** ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా, ఎమర్జెన్సీ డోర్ తెరచుకుని కిందపడి ప్రాణాపాయస్థితిలో ఉన్నటువంటి తమ కుమారుడికి ప్రాణభిక్ష పెట్టి ఆదుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సుబ్రహ్మణ్యం, కాంతమ్మ దంపతులు శుక్రవారం విలేకరుల ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. వారు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలం పాస్నేటిపాళ్యం గ్రామం పనసమాకులపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం, కాంతమ్మల కుమారుడు తరుణ్(9) పట్టణంలోని పప్పిరెడ్డిపల్లె పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈనెల 11న భార్య కాంతమ్మ, కుమారుడు తరుణ్‌తో కలిసి సుబ్రహ్మణ్యం రామసముద్రం మండలం చెంబకూరులోని తమ బంధువుల ఇంటికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. రామసముద్రం మార్గంలో ప్రమాదకరమైన మలుపులు ఉండటం, బస్సు డ్రైవర్ వేగంగా నడుపుతూ స్పీడ్‌బ్రేకర్ కారణంగా సడెన్ బ్రేక్ వేయడంతో ఎమర్జెన్సీ డోర్‌కు ఆనుకుని కూర్చున్న తరుణ్.. డోర్ ఓపెన్ కావడంతో కిందపడ్డాడు. హుటాహుటిన తరుణ్‌ను తీసుకుని ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షలు జరిపి తలకు తీవ్ర గాయమైందని, మెదడులో రక్తం గడ్డ కట్టడంతో ఆపరేషన్ చేయక తప్పదని చెప్పారు. దీనికి సుమారుగా రూ.2–3 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. పేదరికంతో భరించే స్తోమత లేక దాతల సాయాన్ని తల్లిదండ్రులు అభ్యర్థిస్తున్నారు. తమ బిడ్డను ఆదుకోవాలనే దాతలు 9502461515 ఫోన్‌పే/గూగుల్ పే నంబర్‌కు పంపి ఆదుకోవాలని వారు కోరారు.

సాక్షి బిజినెస్
శనివారం
18-3-2023

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 355 | 57,990 |
| నిఫ్టీ ▲ | 114 | 17,100 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 11,650 | ▽ 66 |
| డోజోన్స్ | 31,923 | ▽ 323 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,335 | ▽ 75 |
| డాక్స్ | 14,768 | ▽ 199 |
| షాంఘై | 3,251 | ▲ 24 |
| నికాయ్ | 27,334 | ▲ 323 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ రూ.లలో – ముంబై | |
|---|---|
| బంగారం (24 క్యారట్) 58,882 | ▽ 121 |
| బంగారం (22 క్యారట్) 58,646 | ▽ 120 |
| వెండి (కిలో) 71,576 | ▽ 523 |



## బిస్లెరీతో చర్చలకు 'టాటా'

### వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



**న్యూఢిల్లీ:** ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

**తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.**

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| **18-2-2023** | |
| విశాఖ | 450-00 |
| చిత్తూరు | 473-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 438-00 |
| విజయవాడ | 438-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **17-2-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 425-00 |
| వరంగల్ | 427-00 |
| రిటైల్ ధర | 4.95 |

## మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.

**అంతర్జాతీయంగా విస్తరణ..:** కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

**కొత్త ఫ్రీజర్ల శ్రేణి..**

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20–25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15–20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

## హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

### ఎన్‌సీఎల్‌టీ అనుమతి

**న్యూఢిల్లీ:** ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్టిగేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

**ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్**

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రొపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

## సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్‌ఎస్ సిరీస్



**హైదరాబాద్:** బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్‌ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్‌ఎస్ 160, ఎన్‌ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్‌ఎస్ 200 మోడల్ 18.75 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6–స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్‌ఎస్ 160 మోడల్ 14.6 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5–స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.

## బిగ్'సి' ఉగాది ఆఫర్లు



**హైదరాబాద్:** మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. "ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.

## ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ



**న్యూఢిల్లీ:** ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.

## ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు



**ముంబై:** ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్థంలో కనిష్టాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అర శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

## ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్‌ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిశాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్‌ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జొహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



# రాహుల్, జడేజా గెలిపించగా...




- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

**తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.**

**ముంబై:** ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

**మార్ష్ మినహా...**

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.




**శతక భాగస్వామ్యం...**

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

**స్కోరు వివరాలు:**

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

**వికెట్ల పతనం:** 1–5, 2–77, 3–129, 4–139, 5–169, 6–174, 7–184, 8–184, 9–188, 10–188. **బౌలింగ్:** షమీ 6–2–17–3, సిరాజ్ 5.4–1–29–3, పాండ్యా 5–0–29–1, శార్దుల్ 2–0–12–0, జడేజా 9–0–46–2, కుల్దీప్ 8–1–48–1.

**భారత్ ఇన్నింగ్స్:** ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1–5, 2–16, 3–16, 4–39, 5–83. **బౌలింగ్:** స్టార్క్ 9.5–0–49–3, స్టొయినిస్ 7–1–27–2, అబాట్ 9–0–31–0, గ్రీన్ 6–0–35–0, జంపా 6–0–37–0, మ్యాక్స్‌వెల్ 2–0–7–0.




## గాయత్రి–ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

**బర్మింగ్‌హామ్:** ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ – ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి – ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21–14, 18–21, 21–12 స్కోరుతో లీ వెన్ మీ – ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి – ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి – ట్రెసా 6–2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6–6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11–8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18–12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి – ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8–1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11–4..13–5..15–8..18–10...ఇలా సాగింది. 20–12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా – లీ సా హితో గాయత్రి – ట్రెసా తలపడతారు.



## జాస్మిన్, శశి ముందంజ

### వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5–0 స్కోరుతో ఎంవాంగి టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0–5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.




## ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

**డబ్లిన్:** ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

## న్యూజిలాండ్ 155/2

**వెల్లింగ్టన్:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

## 'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

**కెంట్:** భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.